క్లుప్తంగా

మోషేన్‌రాజుకు సత్కారం



శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని అంబేద్కర్ భవనానికి సొంత కుర్చీలు అందచేసిన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును అంబేద్కర్ భవనం నిర్వాహకులు అభినందించి సత్కరించారు. బుధవారం భీమవరంలోని శాసన మండలి చైర్మన్ నివాసంలో పలువురు దళిత నాయకులు మోషేన్‌రాజును కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

పెన్నాడ హైస్కూల్ తనిఖీ



తనిఖీ చేస్తున్న డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్

పాలకోడేరు: రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ఇంచార్జి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా బుధవారం పెన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. ఈ కార్యక్రమం సక్రమంగా జరుగుతుందా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఏమైనా వ్యాధులు ప్రబలినట్లు గుర్తిస్తే వారిని ఏరియా ఆసుపత్రికి పంపించాలని పూర్తి వైద్యం ప్రభుత్వమే అందిస్తుందని గులాబ్ రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆ మధుర స్వరం చిరస్మరణీయం



ఘంటశాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: సృష్టి ఉన్నంత వరకూ ఆ మధుర స్వరం చిరస్మరణీయంగా ఉంటుందని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక దొరగారి చెరువుగట్టు వద్ద గానగంధర్వుడు, స్వర్గీయ ఘంటశాల వెంకటేశ్వరరావు జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ ఘంటశాల గాయకుడు, సంగీత దర్శకుడే కాదు అపర దేశభక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఘంటశాల అభిమానులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



భీమవరంలో ఘంటసాల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం భీమవరం పట్టణంలోని కాటన్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంస్య విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి వల్లూరు వెంకట రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఘంటసాల మాటలు మరువలేనివని కొనియాడారు. ఘంటసాల గానం చేసిన భగవద్గీత ప్రజలకు మరింత చేరువ చేసిందన్నారు.వేగేశ్న రంగరాజు, అల్లూరి పద్మరాజు, పెన్మెత్స వెంకటరామరాజు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాల్లో వైద్యులపై నిఘా

- స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్న ఫిర్యాదులు
- ఆస్పత్రికో ప్రత్యేక అధికారి
- వైద్యుల పనితీరు, ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై ప్రతిరోజూ నివేదికలు



భీమవరం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి

భీమవరం(ప్రకాశం చౌక్): సర్కారు దవాఖానాల్లో విధినిర్వహణలో ఉన్న వైద్యులకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, వైద్య ఆరోగ్యశాఖలు నూతన మార్గదర్శకాలను జారీ చేశాయి. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు వైద్యులు పూర్తిస్థాయిలో ఆయా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండే విధంగా ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పటికే ఆయా విభాగాల నుంచి ఆస్పత్రుల సూపరింటెండెంట్స్, మెడికల్ ఆఫీసర్స్‌కు ఉత్తర్వులు అందాయి. ముఖ్యంగా ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉండడంలేదనే ఫిర్యాదులు ఇటీవల అధికమయ్యాయని ఈ నేపథ్యంలో నూతన మార్గదర్శకాలు అమలు చేస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈనెల 28న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వైద్యాధికారులకు సూచనలు చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లతోపాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో వైద్యులపై ప్రత్యేక అధికారులను నియమించి వారి వివరాలను సైతం జారీ చేశారు. ఇలా రెండు శాఖల్లోను ఆస్పత్రికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులుగా నియమించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్లు, మునిసిపల్ మేనేజర్లు, వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించడమే కాకుండా ఆస్పత్రిలో ఉన్న వసతులు, అందుతున్న సేవలు, పారిశుద్ధ్యం, రోగులకు అందుతున్న వైద్య సేవలు ఇలా అన్నిటిపైనా ప్రతిరోజూ సాయంత్రం జిల్లా కేంద్రానికి రిపోర్టు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఓపీ విభాగంలో అందుబాటులో ఉండి రోజుకు మూడుసార్లు ఎఫ్‌ఆర్‌ఎస్ విధిగా అటెండెన్స్ వేయాల్సి ఉంది.

జిల్లాలో 64 మంది ప్రత్యేక అధికారుల నియామకం

జిల్లాలో మొత్తం 60 ప్రభుత్వ ఆస్పత్రులు ఉండగా 60 మంది ప్రత్యేక అధికారులను కలెక్టర్ నియమించారు. జిల్లా ఆస్పత్రి (తణుకు), నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఏరియా ఆస్పత్రులకు ఆర్డీవోలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అలాగే సీహెచ్‌సీల వైద్యుల పరివేక్షణకు మున్సిపల్ కమిషనర్లను, పీహెచ్‌సీలకు తహసీల్దార్లను, ఎంపీడీవోలను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగింది.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణాంశాలు ఇవే..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా ఆస్పత్రుల్లో ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు ప్రతి రోజూ కొన్ని అంశాలను పరిశీలించి జిల్లా కేంద్రానికి నివేదికను ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్‌లో వైద్యుల ఆలస్యం, ముందుగా వెళ్లిపోవడం, ఆస్పత్రి బయట ఉండడం, గైర్హాజరు, దీర్ఘకాలిక సెలవులు, సమాచారం లేకుండా సెలవులతోపాటు అత్యవసర విభాగం, ఇన్, అవుట్ పేషెంట్‌ల సేవల తాలూకా రిజిస్టర్లు, రోగుల అందుకున్న సేవలపై సమాచారం, రిఫరల్స్, రోగులకు అందిన సేవలు, వైద్యపరీక్షల సేవలు, రికార్డులు, మందుల పంపిణీ, స్టాక్, రికార్డులు, వైద్యుల పేర్లకు సంబంధించిన సమాచారం, శస్త్ర చికిత్సలు, ప్రసవాలు, ఎన్టీఆర్ వైద్యసేవ, జనన, మరణ ధృవపత్రాల రిజిస్ట్రేషన్, సదరం సేవలు, రోగులకు ఆహారం పంపిణీ, అభివృద్ధి కమిటీ సమావేశాలకు సంబంధించిన రికార్డులు, పారిశుధ్యం, ఏఆర్‌టీ, ఐసీటీసీ సేవలు, ఆక్సిజన్, సెక్యూరిటీ వంటి సేవల ప్రధానాంశాలుగా నిర్దేశించారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యుల పనితీరులో మార్పు వస్తుందో లేదో వేచి చూడాల్సిందే మరి.

మద్యం విక్రయదారుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

భీమవరం: భీమవరం పట్టణంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న వి.కృష్ణమూర్తిని అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పీఎస్‌డీ భోగేశ్వరరావు చెప్పారు. ఏలూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన సమాచారం మేరకు దాడులు చేసి కృష్ణమూర్తి వద్ద నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు భోగేశ్వరరావు తెలిపారు.

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: క్రిస్మస్ ద్వారా దేవుడు లోకానికి వెలుగై వచ్చాడని రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి బ్రదర్ మేడిద జాన్సన్ అన్నారు. బుధవారం ఉండి మండలం చెరుకువాడ క్రీస్తు సంఘం మీటింగ్ హాల్‌లో మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్‌ను మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సోడదాసి పీటర్, వై యోనాతాను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన పాస్టర్స్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసిన అనంతరం జాన్సన్ సౌజన్యంతో పాస్టర్స్‌కు క్రిస్మస్ బహుమతులను అందజేశారు. కార్యవర్గ సభ్యులు కోశాధికారి రాపాక జయరాజు, డాక్టర్ ఈలి డేవిడ్‌మార్క్, సోడదాసి దేవవరదానం, నల్లి సామ్యూల్‌రాజు, నన్నేటి చంద్రబాబు, నీతిపూడి యోహాను, శేఖర్‌బాబు, బలే బేబీ, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

భీమవరం అర్బన్: భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ కే బల రామారావు తన సిబ్బందితో తాడేరు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పాలపర్తి జాన్ రత్నకుమార్ ను అదుపులోకి తీసుకొని ఆయన వద్ద నుంచి ఆరు మద్యం బాట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేశారు. ఈ దాడులలో ఎస్ఐలు ఉమామహేశ్వరరావు, పి సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి సాయంత్రం కుళాయిల బంద్

నరసాపురం: పట్టణంలో హెడ్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో మరమ్మతులు కారణంగా గురువారం సాయంత్రం పూట కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా నిలిపేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం .అంజయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం పూట నుంచి మళ్లీ యథావిధిగా సరఫరా పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



భీమవరంలో కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధించిన ఇమ్మానుయేలు అనాథాశ్రమ విద్యార్థులకు భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఘన స్వాగతం లభించింది. మలేషియాలోని కౌలంపూర్‌లో గత నెల 28వ తేది నుంచి 9వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో జరిగాయి. ఈపోటీల్లో 13 దేశాల నుంచి సుమారు 4,500 మంది క్రీడాకారులు పాల్గొనగా భీమవరం పట్టణంలోని ఇమ్మానుయేలు అనాథాశ్రమ విద్యార్థులకు బాలిక కటా విభాగంలో డి ప్రియ జపాన్ క్రీడాకారులతో తలపడి బంగారు పతకం సాధించగా, బి జెస్సీ ప్రిన్సిపల్ ఇండోనేషియాపై సిల్వర్ మెడల్, ఎన్ అశ్విని థాయిలాండ్‌పై బ్రౌంజ్ మెడల్ గెల్చుకున్నారు. మలేషియా నుంచి బుధవారం భీమవరం వచ్చిన క్రీడాకారులను శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వి భాస్కరరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని మలేసియా పోటీల్లో వివిధ దేశాల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నా 16 మంది మాత్రమే తుది పోరులో నిలిచారని, వారిలో భీమవరం క్రీడాకారులు ముగ్గురు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహకుడు బి పూర్ణచంద్రరావు, కార్యదర్శి బత్తుల ఎర్నెస్ట్‌పాల్, చెరుకువాడ రంగసాయి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఉండి: ఈ నెల 6 నుంచి 30 వరకు మండలంలోని 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నాగార్జున పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్ల బృందం అందుబాటులో ఉండి రోజుకో గ్రామం చొప్పున సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులు ఈ నెల 6న ఎన్నార్పీ అగ్రహారం, 7న మహదేవపట్నం, 9న ఆరేడు, 10న ఉప్పులూరు, 11న పాందువ్వ, ఖండ్రిక, 12న ఉండి, 13న చెరుకువాడ, 16న కలిసిపూడి, 17న కోలమూరు, 18న పాములపర్రు, 19న కలిగొట్ల, 20న యండగండి, 21న ఉణుదుర్రు, 23న అర్తమూరు, 24న చిలుకూరు, 26న వెలివర్రు, 27న వాండ్రం, 28న పెదపుల్లేరు, 30న చినపుల్లేరులో రీసర్వేపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: భీమవరం ఆర్డీవో ఆదేశానుసారం ఈ నెల 6 నుంచి 10 వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎస్.భారతీ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

రైతుల ఇష్టం మేరకు మిల్లుల ఎంపిక



రైతులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

పాలకోడేరు: రైతులు వారు కోరుకున్న మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని శృంగవృక్షం ఎస్‌వీవీఎస్ రైసు మిల్లును జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం తీసుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. తూకం తూసే మిషన్లు పరిశీలించారు. రైసుమిల్లు రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల లోపు వారి ఖాతాలకు సొమ్ము జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు వారి సమీప రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. రైతుల ధాన్యం రైసు మిల్లుకు చేరడానికి పట్టే సమయం, రవాణా కాబడిన సమయం, దూరం నిర్ణయించామన్నారు. ధాన్యం సకాలంలో దిగుమతి అయ్యేలా తగు చర్యలు తీసుకున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహల్ కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో బాలికల వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుహాసిని

ఆకివీడు: అప్రమత్తత, అనుక్షణం జాగ్రత్తలు పాటిస్తూ కిషోర బాలికలు తమ భవిష్యత్‌కు మంచి మార్గం ఏర్పరుచుకోవాలని ఎంపీడీఓ సుహాసిని సూచించారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం కిషోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 11–18 ఏళ్ల వయస్సు కలిగిన బాల బాలికలు చదువు పట్ల ఆసక్తి పెంచుకుని ఇష్టంగా చదవాలన్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. పిల్లలకు మంచి వాతావరణం కల్పించినప్పుడే వారి ఎదుగుదలలో అభివృద్ధి కన్పిస్తుందన్నారు. సీడీపీఓ వాణీ విజయరత్నం మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమన్నారు. బాల్య వివాహాలు జరిగితే దగ్గరలోని ఏ అధికారికైనా ఫోన్ ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలన్నారు. బాల బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కిషోర బాలికలు యోగా, మెడిటేషన్ నిత్యం చేయాలని జిల్లా స్థాయి శిక్షణ ఉపాధ్యాయురాలు నీలవేణి సూచించారు. బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాలను అడ్వకేట్ విజ్ఞాన దేవి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పీఆర్ రత్నకుమారి, కేవీ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి



అనాకోడేరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు చిన్నప్పటినుంచి నైతిక విలువలు పెంపొందించుకోవాలని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్న బాబు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్లో బుధవారం మానవత సర్వోదయమండలి ఆధ్వర్యంలో నైతిక విలువలు, కెరీర్ గైడెన్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ విద్యార్థులు మంచి పుస్తకాలను చదవాలని, యోగా చేయాలని, శారీరిక ధారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని, మానసిక ప్రశాంతతను అలవర్చుకుని, కష్టపడి ఇష్టపడి చదవాలన్నారు. గత సంవత్సరం తొమ్మిదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. అందమైన దస్తూరి గల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ సుంకర పరమేశ్వరరావు, విశ్రాంత డీఈవో ఇందుకూరి ప్రసాదరాజు, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్, కెవి సుబ్బరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.గోపాల శర్మ, మానవత భీమవరం మండల శాఖ చైర్మన్ బి వెంకట పతిరాజు, పాఠశాల ఉపాధ్యాయులు వి ఎం నిర్మలాకుమారి, జి నర్మద, ఎన్ డి వి ప్రసాద్, ఎంవి శ్రీలక్ష్మి, డి అనురాధ, కె రాజేష్ కుమార్ రాజు, జి ఎస్ విజయలక్ష్మి, బి రత్నకుమారి, జలాబాయి, వై శకుంతల, ఎం బాల పల్లాల రాజు, తదితరులు పాల్గొన్నారు

సృజనాత్మక ఆలోచనలతో ఎన్నో మార్పులు



భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో సావనీర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అనుసంధానంతోనే ఇన్నోవేషన్‌లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని మలేషియాలోని యూనివర్సిటీ పుత్ర కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఫ్యాకల్టీ డాక్టర్ జురీనా మోహద్ హనాపి చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అల్గరిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పేరిట మూడు రోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరీనా మోహద్ అనాపి మాట్లాడుతూ సృజనాత్మక ఆలోచనలతో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమేగాకుండా ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కాకినాడు జేఎన్టీయూకే కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్ఎస్ఎన్ ఉషాదేవి మాట్లాడుతూ ఏఐ ద్వారా ఎన్నో వినూత్న అంశాలకు జవాబు కూడా పొందవచ్చునన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ తాను సివిల్ ఇంజనీర్ అయినప్పటికీ అనేక నూతన అంశాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అధ్యయనం చేయగలుగుతున్నానన్నారు. దీంతోపాటు నూతన విద్యావిధానంలో విద్యార్థులకు మరింత అడ్వాన్స్ టెక్నాలజీని అందించేందుకుగా జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో నూతన టెక్నాలజీని కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ సదస్సు సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ను మలేషియా శాస్త్రవేత్త జురీనా మోహద్ అనాపి విడుదల చేశారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, సాగి విఠల్‌రంగరాజు, సీఎస్‌సీ హెడ్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, డీన్ అకాడమిక్స్ వి చంద్రశేఖర్, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్ ఎంవీ పాండురంగారావు, కన్వీనర్ ఆర్ఎస్‌వి జగన్మోహన్, కో కన్వీనర్ తంగిరాల వెంకట పూర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రంగరాజు సేవలు ఎనలేనివి



రంగరాజును సత్కరిస్తున్న స్థానికులు, నాయకులు

ఉండి: ఉపాధ్యాయుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా విశేష ప్రతిభ కనబరిచి డాక్టరేట్ సాధించిన రంగరాజు అభినందనీయుడని కృషి విజ్ఞాన కేంద్రం హోంసైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.దెబోరామెస్సియానా అన్నారు. బుధవారం ఎన్నార్పీ అగ్రహారం చెరువుగట్టుపాలెంలో స్థానికులు, మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఇటీవల డాక్టరేట్ సాధించిన రంగరాజుకు అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎంవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త దెబోరామెస్సియానా మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా పనిచేసి నాటకరంగంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్‌లు కన్నెగంటి రూత్‌కళ, కౌరు కోటేశ్వరరావు, పాలతీర్థపు నర్సింగరావు, హెచ్ఎం పులిదిండి సత్యం, ఎస్ఎంసీ చైర్మన్ పద్మ, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు లలిత, అంజమ్మ పాల్గొన్నారు.

'మానవత' సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

భీమవరం: మానవత సంస్థ భీమవరం మండలశాఖ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని టి అశ్విని వరలక్ష్మికి బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సభ్యుడు ఆర్ఎస్ రామ్మోహనరావు కళాశాల ఫీజు నిమిత్తం విద్యార్థిని తండ్రి నాగబాబుకు ఈనగదును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజులు మాట్లాడుతూ ప్రతిభవంతురాలైన వరలక్ష్మి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండడంతో వారి ఇబ్బందిని తెలుసుకుని సంస్థ సభ్యుడు రామ్మోహనరావు విద్యా ప్రోత్సాహకం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మూరి నర్సింహమూర్తిబాబు, ఇందుకూరి ప్రసాదరాజు, గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, రామకృష్ణంరాజు, కలిగొట్ల గోపాల శర్మ, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.